
తెలుగు
# సంచలనం
చీఫ్ ఎడిటర్: బత్తుల గణేష్
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
జాతీయ వార్త పత్రిక
www.sanchalanamnews.in epaper.sanchalanamnews.in
హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 10 | పేజీలు : 8 | శుక్రవారం 19 జూన్ 2026 | వెల : 3/-
Circulated by Hyderabad, Nalgonda, Khammam, Mahaboobnagar, Rangareddy, Medhak, Karimnagar, Adhilabad, Nizamabad, Warangal, Vijayawada, Tirupathi



## ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు

- ఈ వాననీటి సంరక్షణ చర్యలతో గండం గట్టెక్కేద్దామా!
- ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు
- రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశం
- ఇప్పటి నుంచే అప్రమత్త మవ్వకుంటే ఇబ్బందులే
- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణుల సూచనలు

## ఎవరు అడ్డుపడినా ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం

- ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం
- రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో వన మహోత్సవాన్ని ప్రారంభించిన సీఎం
- గుర్రంగూడ అర్బన్ ఎకో పార్క్ నమూనా సీఎంకు వివరించిన అటవీ అధికారులు
- హరిత నిధి ద్వారా నాగలింగం మొక్క నాటిన సీఎం
- ఢిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదనే తమ ప్రయత్నం



హైదరాబాద్:
ఎల్బీనగర్ ప్రాంతంలో 424 ఎకరాల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైడ్రాను తీసుకొస్తే దానిని భూతంగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. న్యాయంగా నిర్మాణాలు చేసిన వారికి జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే మాత్రం హైడ్రా ఊరుకోదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. చెరువులు కబ్జాలు చేయడం వల్లే కాలనీల్లో నీళ్లు నిల్వ ఉంటున్నాయన్న సీఎం, ప్రజలు ఈ విషయం గ్రహించాలన్నారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో వనమహోత్సవాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ఢిల్లీలో గాలి, నీరు మట్నత్తం విషమని అక్కడ - మిగతా 3లో




## వదంతులు నమ్మొద్దు, ప్రశాంతంగా ఉండండి

- నీట్ రీఎగ్జామ్ రాయబోతున్న విద్యార్థులకు ఎన్టీయే సూచన
- జూన్ 21న నీట్ యూజీ రీ-ఎగ్జామ్ యథాతథం
- వదంతులు నమ్మొద్దు, ప్రశాంతంగా ఉండాలంటూ విద్యార్థులకు ఎన్టీఏ సూచన
- పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశామని వెల్లడి



## కొత్తగా 3కోట్ల మందికి రేషన్ కార్డులు

- గుడ్ న్యూస్ చెప్పిన కేంద్రమంత్రి
- రేషన్ కార్డులపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి కీలక ప్రకటన
- భారీగా రేషన్ కార్డులను తొలగించినట్లు వెల్లడి
- త్వరలోనే కొత్తకార్డులు జారీ చేయనున్నట్లు స్పష్టీకరణ

## 3 రోజులపాటు రిజిస్ట్రేషన్ సేవలు బంద్

- జూన్ 26 నుంచి 28 వరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్
- వెల్లడించిన రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీ
- ప్రజలు తమ పనులకు ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని సూచన
- రిజిస్ట్రేషన్లకు సేవలు పని చేయని దినాలు



హైదరాబాద్
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి వెబ్‌సైట్, అనుబంధ ఆన్‌లైన్ సేవల గురించి ఆ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు కీలక ప్రకటన చేశారు. షెడ్యూల్ చేసిన సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా సేవలు అందుబాటులో ఉండవని వెల్లడించారు. సుమారు ఐదు సంవత్సరాల తర్వాత ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిర్వహణ పనుల - మిగతా 3లో

## భవిష్యత్తు ఇంధనంపై కొత్త ఆశలు

- భారీగా తగ్గనున్న గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు!
- పెట్రో, డీజిల్ వంటి ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్
- ప్రస్తుతం దీని ఉత్పత్తి ఖర్చు చాలా ఎక్కువ
- సోలార్‌తో విద్యుత్ ఉత్పత్తి చేసి తర్వాత నీటిలోకి పంపి హైడ్రోజన్‌ను వేరు చేస్తున్న వైనం
- కొత్త పరిశోధనలో విద్యుత్ అవసరం లేకుండా హైడ్రోజన్ ఉత్పత్తి
- ప్యానెళ్ల ద్వారా నేరుగా నీటి నుంచి హైడ్రోజన్



## ఇప్పట్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం సాధ్యం కాదు



- ఇంధన ధరలపై కేంద్ర మంత్రి వివరణ
- ముడి చమురు ధరలు తగ్గిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేమన్న సురేశ్ గోపి
- చౌకైన చమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని వ్యాఖ్య



## నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

- గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేసిన కవిత
- తాను జైల్లో ఉన్నప్పుడు కొందరు నేతలు తన వద్దకు వచ్చారన్న కవిత
- బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో వచ్చారని వెల్లడి
- ఆ ప్రతిపాదనను తాను తీవ్రంగా వ్యతిరేకించానన్న కవిత
- పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డానని వెల్లడి

హైదరాబాద్
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్ తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో - మిగతా 3లో

## ఏడు రకాల సన్నాలకు బోనస్

- రైతు భరోసా తేదీలో మార్పు
- మంత్రివర్గం కీలక నిర్ణయం
- వానాకాలం సాగుకు రైతు భరోసా ఇవ్వాలని మంత్రివర్గ అనధికార సమావేశంలో నిర్ణయం
- హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లపై చర్చ
- ఈ నెల 30న రైతుభరోసా నిధులు విడుదల
- వీబీజీ రామ్‌జీ పథకంపై నిరసన తెలిపాలని నిర్ణయం
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై చర్చించిన సీఎం, మంత్రులు




హైదరాబాద్
సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ అనధికార సమావేశంలో రైతు భరోసా సహా పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వానాకాలం సాగుకు రైతు భరోసాను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 30 నుంచి రైతు భరోసా నిధులను విడుదల చేయాలని మంత్రివర్గ అనధికార సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లపై, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సీఎం, మంత్రులు చర్చించారు. ఈ నెల 30న మధిరలో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రులు మీడియాకు వివరించారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని - మిగతా 3లో




## నకిలీ లాయర్లకు చెక్ పెట్టేందుకు 'డిజిటల్ రిజిస్ట్రీ' ఏర్పాటు

- కేంద్రం, బీసీఐలకు సుప్రీం నోటీసులు
- ప్రతి న్యాయవాదికి ప్రత్యేక జాతీయ అడ్వకేట్ ఐడీ ఇవ్వాలని విజ్ఞప్తి
- కేంద్ర ప్రభుత్వం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యూజీసీకి నోటీసులు
- సోషల్ మీడియా వినియోగంపై న్యాయవాదులకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి అవసరమన్న పిటిషన్

## రోడ్డు ప్రమాదాల పెరుగుదలలో తెలంగాణ టాప్..

- కేంద్రం నివేదికలో షాకింగ్ నిజాలు!
- ప్రధాన రాష్ట్రాల్లో తెలంగాణలోనే అత్యధికంగా రోడ్డు ప్రమాదాల పెరుగుదల
- 2024లో 13.5 శాతం పెరిగిన యాక్సిడెంట్లు.. కేంద్ర నివేదిక వెల్లడి
- ప్రమాదాలకు అతివేగమే ప్రధాన కారణమని గుర్తింపు
- మరణాల వృద్ధిరేటులోనూ దక్షిణ భారతంలో తెలంగాణ టాప్
- చిన్న ప్రమాదాల నమోదుతోనే సంఖ్య పెరిగిందంటున్న అధికారులుఋ



# నకిలీ లాయర్లకు చెక్ పెట్టేందుకు
# డిజిటల్ రిజిస్ట్రీ ఏర్పాటు

దేశంలో నకిలీ న్యాయవాదుల సమస్యకు అడ్డుకట్ట వేయడంతో పాటు న్యాయవాదుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు జాతీయ స్థాయిలో డిజిటల్ రిజిస్ట్రీ ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిపై సుప్రీంకోర్టు స్పందించింది. ఆ అంశంపై కేంద్ర ప్రభుత్వం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తదితర సంస్థలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని గురువారం నోటీసులు జారీ చేసింది. భారత బార్ అసోసియేషన్ (బీఏఐ) దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషన్‌లో ప్రతిపాదించిన ఆలోచన వినూత్నంగా ఉందని, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దీనిని అమలు చేయడం సాధ్యమేనని ప్రాథమికంగా అభిప్రాయపడింది. తదుపరి విచారణను జూలై నెలకు వాయిదా వేసింది.



### ప్రతి న్యాయవాదికి ప్రత్యేక గుర్తింపు

దేశవ్యాప్తంగా న్యాయవాదుల కోసం నేషనల్ డిజిటల్ రిజిస్ట్రీ ఫర్ లీగల్ ప్రొఫెషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌డీఆర్‌ఎల్‌పీ) పేరుతో ఒక సమగ్ర డిజిటల్ వేదికను ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఇందులో ప్రతి న్యాయవాదికి ప్రత్యేక జాతీయ అడ్వకేట్ గుర్తింపు సంఖ్య (యూనిక్ నేషనల్ అడ్వకేట్ ఐడెంటిఫయర్) ఇవ్వాలని సూచించారు. అలాగే న్యాయవాది నమోదు స్థితి, విద్యార్హతలు, క్రమశిక్షణా చర్యల వివరాలు, ప్రాక్టీస్‌కు అర్హత వంటి సమాచారం రియల్‌టైమ్‌లో అందుబాటులో ఉండేలా వ్యవస్థను రూపొందించాలని కోరారు. ప్రజలు, కోర్టులు లేదా సంబంధిత అధికారులు క్యూఆర్ కోడ్ ద్వారా న్యాయవాది వివరాలను వెంటనే ధ్రువీకరించుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### విభిన్న రాష్ట్రాల్లో విభజనతో సమస్యలు

పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం ప్రస్తుతం దేశంలో సుమారు 18 లక్షల మంది న్యాయవాదులు నమోదై ఉన్నారు. అయితే వీరి వివరాలను ఒకే చోట సమగ్రంగా ధ్రువీకరించుకునే జాతీయ స్థాయి డేటాబేస్ లేదు. ప్రస్తుతం 23 రాష్ట్ర బార్ కౌన్సిళ్లు విడివిడిగా నమోదు ప్రక్రియలు నిర్వహిస్తున్నాయని, వీటి మధ్య ఏకరీతి ప్రమాణాలు లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒక న్యాయవాది విద్యార్హతలు, నమోదు చెల్లుబాటు వంటి అంశాలను ప్రజలు తక్షణం తెలుసుకునే అవకాశం ప్రస్తుతం లేదని వివరించారు. ఆ పరిస్థితుల వల్ల నకిలీ సర్టిఫికెట్లతో లేదా తప్పుడు సమాచారంతో న్యాయవాదులుగా కొనసాగుతున్న వ్యక్తులను గుర్తించడం కష్టమవుతోందని బీఏఐ అభిప్రాయపడింది. అందుకే సాంకేతికత ఆధారిత శాశ్వత వ్యవస్థ అవసరమని పేర్కొంది.

### సోషల్ మీడియాపై నియంత్రణ అవసరం

పిటిషన్‌లో మరో ముఖ్య అంశంగా సోషల్ మీడియా వినియోగంపై న్యాయవాదులకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి రూపొందించాలని కోరారు. అడ్వకేట్స్ యాక్ట్-1961లోని సెక్షన్ 49 కింద బీసీఐ దీనికి సంబంధించి మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవలి కాలంలో కొందరు న్యాయవాదులు సోషల్ మీడియా వేదికల్లో కోర్టు హాజరులు, కేసుల వివరాలు, వ్యక్తిగత ప్రచారం కోసం వీడియోలు, రీల్స్, ప్రచార కంటెంట్‌ను విస్తృతంగా పోస్టు చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### ‘అసభ్య వ్యాఖ్యలు చూస్తున్నాం’

విచారణ సందర్భంగా సోషల్ మీడియా ప్రవర్తన అంశం ప్రస్తావనకు రావడంతో ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ వేదికల్లో కొందరు చేస్తున్న వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ‘మేము కొన్ని నమూనాలను చూశాం. చాలా అసభ్యకరమైన వ్యాఖ్యలు, ప్రకటనలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. వాటికి న్యాయవృత్తితో ఎలాంటి సంబంధం లేదు’ అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిజమైన న్యాయవాదులు వృత్తి నైతిక విలువలను గౌరవిస్తారని, న్యాయవాదిగా మారిన మొదటి రోజు నుంచే వృత్తి ధర్మం గురించి నేర్చుకుంటారని పేర్కొంది. న్యాయవృత్తిని అపకీర్తి పరుస్తున్న వ్యక్తులు నిజంగా వృత్తిపరమైన ప్రమాణాలను పాటించే న్యాయవాదులేనా అన్న సందేహం కూడా వ్యక్తం చేసింది.

### యువ న్యాయవాదులే భవిష్యత్తు

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి యువ న్యాయవాదుల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. యువ న్యాయవాదులను బలోపేతం చేయడం అత్యంత అవసరమని అన్నారు. దేశంలోని కొన్ని హైకోర్టులు, జిల్లా కోర్టుల్లో యువ న్యాయవాదులు తమ స్వంత సంఘాలను ఏర్పాటు చేసుకుని విద్యా కార్యక్రమాలు, న్యాయ అంశాలపై చర్చలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. ‘మన ఆశలన్నీ యువ న్యాయవాదులు, రాబోయే తరం న్యాయవృత్తి సభ్యులపైనే ఉన్నాయి’ అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

### యూజీసీ పాత్ర కూడా కీలకం

న్యాయ విద్యార్హతల ధ్రువీకరణ కోసం యూజీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక డిజిటల్ పోర్టల్ ఏర్పాటు చేయాలని కూడా పిటిషన్‌లో కోరారు. బీసీఐ గుర్తింపు పొందిన అన్ని న్యాయ కళాశాలల డిగ్రీ వివరాలను ఈ పోర్టల్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. దీంతో న్యాయవాదుల విద్యార్హతలను సులభంగా ధ్రువీకరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో న్యాయ విశ్వవిద్యాలయాలను కూడా కేసులో పక్షాలుగా చేర్చాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

### పర్యవేక్షణ కమిటీ ప్రతిపాదన

ఎన్‌డీఆర్‌ఎల్‌పీ అమలును పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా పిటిషన్‌లో కోరారు. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి పురోగతి నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలని సూచించారు. అదేవిధంగా జాతీయ స్థాయి న్యాయ పరిపాలన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా ఆ డిజిటల్ రిజిస్ట్రీని అభివృద్ధి చేయడానికి న్యాయ శాఖ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్తగా 3కోట్ల మందికి రేషన్ కార్డులు

దేశవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు మరో 3 కోట్ల కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) జాబితాల నుంచి 2.21 కోట్ల మంది అనర్హులను తొలగించిన నేపథ్యంలో కొత్త లబ్ధిదారులను చేర్చేందుకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. దిల్లీలో ఏర్పాటు చేసిన ఓ ప్రహ్లాద్ జోషి ఈ మేరకు వ్యాఖ్యానించారు.



### అనర్హుల జాబితాలో 8.51 కోట్ల మంది

అనర్హుల తొలగింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలే తమ ప్రమాణాల ప్రకారం నిర్వహించాయని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. మరణించిన వ్యక్తులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఫోర్? వీలర్? వాహనాలు కలిగిన వారు సహా మొత్తం 8.51 కోట్ల మంది అనర్హుల జాబితాను కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ గుర్తించి రాష్ట్రాలకు పంపిందన్నారు. అందులో ఇప్పటివరకు 2.21 కోట్ల మందిని మాత్రమే రాష్ట్రాలు తొలగించాయని వివరించారు. కొన్ని రాష్ట్రాలు ఈ ప్రక్రియను పూర్తిచేయగా, మరికొన్ని రాష్ట్రాలు ఇంకా అనర్హులను గుర్తించే పనిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశంలో మొత్తం 79 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం ఖర్చు తగ్గించడం కాదని, నిజంగా అవసరమైన వారికి ఆహార ధాన్యాలు చేరేలా చూడడమేనని స్పష్టం చేశారు.

### ఆహార ధాన్యాలు పంపిణీ

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు పంపిణీ చేసే లక్ష్యం యథావిధిగా కొనసాగుతోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్? జోషి తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ డిజిటలీకరణ వల్లే లబ్ధిదారుల వివరాల ధ్రువీకరణ సులభమైందన్నారు. ప్రస్తుతం పీఎంజీకేవై కింద పంపిణీ అవుతున్న ఆహార ధాన్యాల్లో 98.5 శాతం ఆధార్ ధ్రువీకరణ, ఈ-పాయింట్ ఆఫ్ సేల్ (ఈ-పీఓఎస్) యంత్రాల ద్వారా అందుతున్నాయని చెప్పారు.

### స్మార్ట్ గోదాములు, డిపోలు

ఆహార ధాన్యాల నిల్వ, పంపిణీ వ్యవస్థలో స్మార్ట్ గోదాములు, డిపోలు వంటి ఆధునిక సాంకేతికతలను ప్రవేశపెడుతున్నామని ప్రహ్లాద్ జోషి చెప్పారు. పూర్తిస్థాయి డిజిటల్ పంపిణీ వ్యవస్థ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. కొవిడ్ తర్వాత ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన సహా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కారణంగా సుమారు 25 కోట్ల మంది కడు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. దీనిని ఐఎమ్?ఎఫ్?, నీతి ఆయోగ్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ప్రస్తావించాయని మంత్రి చెప్పారు. ఈ ఏడాది ఆహార సబ్సిడీ భారం పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, కేటాయించిన బడ్జెట్‌తోనే ప్రభుత్వం నిర్వహించగలదని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా, కొద్ది రోజుల క్రితం ఏపీ పర్యటనకు వచ్చిన ప్రహ్లాద్ జోషి కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పౌరసరఫరాల బియ్యం పక్కదారి పట్టకుండా బస్తాలపై క్యూఆర్ కోడ్ ముద్రించడంతో పకడ్బందీగా సరఫరా జరుగుతోందన్నారు. ఈ పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బాగా పర్యవేక్షించడంతో విజయవంతమైందని చెప్పారు. ఈ స్ఫూర్తితోనే దేశవ్యాప్తంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కు చెందిన బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్ ముద్రించడాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ప్రహ్లాద్ జోషి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

## రోడ్డు ప్రమాదాల పెరుగుదలలో తెలంగాణ టాప్..



దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రహదారి ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 22,903 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 25,986కి చేరింది. కేవలం ఏడాది కాలంలోనే ప్రమాదాల సంఖ్య 13.5 శాతం పెరగడం గమనార్హం. ఇది జాతీయ సగటు వృద్ధి రేటు (1.5 శాతం) కంటే చాలా రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. ఈ ప్రమాదాల్లో కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య సైతం భారీగానే ఉంది. 2024లో రాష్ట్రంలో జరిగిన వివిధ ప్రమాదాల్లో సుమారు 7,900 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణాల వృద్ధి రేటు (3.7 శాతం) దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే అత్యధికంగా నమోదైంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మితిమీరిన వేగాన్ని అధికారులు గుర్తించారు. ఒక్క అతివేగం వల్లే 7,500 కంటే ఎక్కువ ప్రమాదాలు జరగ్గా, సుమారు 2,760 మంది మృత్యువాత పడ్డారు. వీటితో పాటు హిట్ అండ్ రన్ కేసులు, వాహనాలను వెనుక నుంచి లేదా పక్క నుంచి ఢీకొట్టడం వంటి ఘటనల కూడా వేలాది మంది మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరగడంపై రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. గతంలో నమోదు కాని చిన్న చిన్న ప్రమాదాలను కూడా ప్రస్తుతం రికార్డు చేస్తుండటం వల్లే గణాంకాలలో ఈ పెరుగుదల కనిపిస్తోందని వారు చెబుతున్నారు. రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ఇప్పటికే జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా రోడ్ల ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దడం, నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం మరియు ప్రమాద సమయాల్లో తక్షణ అత్యవసర స్పందన వంటి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## వదంతులు నమ్మొద్దు, ప్రశాంతంగా ఉండండి

నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌కు మరో మూడు రోజులే సమయం ఉన్న నేపథ్యంలో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అభ్యర్థులకు కీలక సూచనలు చేసింది. జూన్ 21 (ఆదివారం) జరగనున్న ఈ పరీక్షకు ప్రశాంతంగా సిద్ధం కావాలని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్టీఏ ‘ఎక్స్’ వేదికగా విద్యార్థులకు భరోసానిస్తూ ఒక సందేశాన్ని పోస్ట్ చేసింది. “మీరు ఎంతో కష్టపడి సిద్ధమయ్యారు. ఇప్పుడు మీ శ్రమపై నమ్మకం ఉంచాల్సిన సమయం వచ్చింది. ఆందోళన చెందకుండా, తగినంత విశ్రాంతి తీసుకుని పరీక్షలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చండి” అని పేర్కొంది. మే 3న జరిగిన పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో నీట్ యూజీ-2026 పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ప్రతిభావంతులైన విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్టీఏ పునరుద్ఘాటించింది. పరీక్షల పారదర్శక నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అభ్యర్థులు అధికారిక సమాచారం కోసం ఎన్టీఏ వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని సూచించింది. పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థుల కోసం ‘మానస్’ (14416) మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ఎన్టీఏ సూచించింది. “ఒత్తిడికి లోనవుతుంటే మీరు ఒంటరి వారని భావించకండి. సహాయం కోరడం బలహీనత కాదు, అది మీ బలానికి నిదర్శనం” అని పేర్కొంది. నిర్ధారణ లేని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయవద్దని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా కోరింది.

## భవిష్యత్తు ఇంధనంపై కొత్త ఆశలు..

భవిష్యత్‌లో పెట్రోల్, డీజిల్ వంటి సంప్రదాయ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్‌ను భావిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి నుంచి పరిశ్రమలు, రవాణా రంగం వరకు అనేక అవసరాలకు ఉపయోగపడే ఈ స్వచ్ఛ ఇంధనాన్ని తక్కువ ఖర్చుతో తయారు చేయడం కోసం ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జర్మనీకి చెందిన ఓ స్టార్టప్ కొత్త సాంకేతికతను అభివృద్ధి చేసింది. ఎండ, నీటిని ఉపయోగించి నేరుగా హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే ప్రత్యేక ప్యానెల్‌ను రూపొందించినట్లు ప్రకటించింది. జర్మనీలోని కార్ల్స్రూహే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేఐటీ) నుంచి ఏర్పడిన ‘ఫోట్రియాన్’ అనే స్టార్టప్ ఈ ప్యానెల్‌ను అభివృద్ధి చేసింది. సాధారణంగా గ్రీన్ హైడ్రోజన్ తయారీకి ముందుగా సోలార్ ప్యానెల్‌లతో విద్యుత్ ఉత్పత్తి చేసి, దానితో ఎలక్ట్రోలైజర్ ద్వారా నీటిని విడదీసి హైడ్రోజన్‌ను పొందుతారు. అంటే రెండు వేర్వేరు వ్యవస్థలు అవసరం అవుతాయి. అయితే ఫోట్రియాన్ రూపొందించిన కొత్త ప్యానెల్‌లో ఈ రెండు దశలు అవసరం ఉండవని సంస్థ చెబుతోంది. ఏప్రిల్‌లో జర్మనీలో నిర్వహించిన హానోవర్ మెస్సే వాణిజ్య ప్రదర్శనలో ఒక చదరపు మీటర్ విస్తీర్ణం గల నమూనా ప్యానెల్‌ను సంస్థ ప్రదర్శించింది. ఈ ప్యానెల్ సూర్యరశ్మిని గ్రహించి, నీటిలోని అణువులను నేరుగా విడదీసి హైడ్రోజన్, ఆక్సిజన్‌లుగా మారుస్తుంది. ఇందులో ఎక్కడా విద్యుత్ ఉత్పత్తి జరగదు. ‘ఫోటోక్యాటలిసిస్’ అనే ప్రక్రియ ఆధారంగా ఈ సాంకేతికత పనిచేస్తుంది. హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తాజా పరిశోధన కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. తక్కువ ఖర్చుతో భారీ స్థాయిలో తయారు చేయగలిగే విధంగా ప్యానెళ్లను రూపొందించినట్లు ఫోట్రియాన్ వెల్లడించింది. చిన్న పరిశ్రమల నుంచి భారీ సౌర హైడ్రోజన్ కేంద్రాల వరకు వీటిని వినియోగించే అవకాశం ఉందని పేర్కొంది.

## అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం

- పట్టుకునీ కేసు నమోదు చేసిన తుర్కపల్లి పోలీసులు



**తుర్కపల్లి, జూన్ 18(సంచలనం న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్న నేపథ్యంలో, తుర్కపల్లి పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం తుర్కపల్లి పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు ఆలేరూ పరిసర ప్రాంతాల నుండి పీడీఎస్ బియ్యాన్ని సేకరించి గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడైంది. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సుమారు 100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**నిందితుల వివరాలు:**


కేతవత్ ప్రభాస్, తండ్రి శ్రీను, వయస్సు 20 సంవత్సరాలు, వృత్తి: డ్రైవర్, నివాసం: కంధిగడ్డ తండా, ఆలేర్ మండలం, బానోత్ శివ, తండ్రి లచ్చీరామ్, వయస్సు 20 సంవత్సరాలు, వృత్తి: డ్రైవర్, నివాసం: కంధిగడ్డ తండా, ఆలేర్ మండలం కి చెందిన వారి నుండి ఒక డీసీఎం వాహనం 100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, కొనుగోలు చేయడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇటువంటి అక్రమ రవాణా లేదా నిల్వల గురించి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కేసు జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్, డీఎస్పీ పి.శ్రీనివాస్ నాయుడు మరియు యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.శంకర్ పర్యవేక్షణలో, తుర్కపల్లి ఎస్ఐ మహమ్మద్ తఖియుద్దీన్ మరియు సిబ్బంది ఉన్నారు.

## ఇప్పట్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం సాధ్యం కాదు

పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్రమంతి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇరాన్ ఒప్పందంతో ముడిచమురు ధరలు తగ్గిన వెంటనే ఇంధన ధరలను తగ్గించలేమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన ఇదివరకు పెంచిన ధరలను వెంటనే తగ్గించలేమని పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ తెలిపారు. హర్మూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. తక్కువధరకు లభించే ముడిచమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని సురేశ్ గోపి తేల్చిచెప్పారు. ఇటీవల ఇంధన ధరల్లో నమోదైన పెరుగుదలపై స్పందించిన సురేశ్ గోపి, లీటర్?కు సుమారు రూ.3.94 మేర పెరుగుదల ప్రభావం మాత్రమే వినియోగదారలపై పడిందన్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు తగ్గాయని చెప్పి వెంటనే ఆ పెరుగదలను వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. చౌకైన ముడి చమురును భారత్?కు తీసుకురావడనాకి హర్మూజ్ జలసంధి గుండా రవాణా చేయాల్సి ఉంటుందని, ప్రస్తుతం ఆ మార్గంలో నౌకల రాకపోకలు అధికంగా ఉండటంతో

# ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు

ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ సారి వర్షాలు కూడా తక్కువేనని తెలుస్తోంది. ఈనెల 9 తేదీన నగరాన్ని కుదిపిన వర్షం తర్వాత ఆ స్థాయిలో పడలేదు. వాతావరణంలో పెనుమార్పులు వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ రానున్న రోజుల్లో నగరంలో నీటి కటకటకు సంకేతాలు. ఇప్పటి నుంచే అప్రమత్తమవ్వకుంటే ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే కురిసిన ప్రతి వాననీటి చుక్కనూ ఒడిసిపట్టాలి. ఇప్పటికే వేసిన ఇంజక్షన్ బోర్లు, తవ్విన ఇంకుడు గుంతలను పునరుద్ధరించి సిద్ధం చేసుకోవాలి.



**పూడిక నిండిపోవడంతోనే**

ఇటీవల కురిసిన వర్షాలకు గచ్చిబౌలి ప్రాంతంలోని మీనాక్షి టవర్స్ ప్రాంతం నీటమునిగింది. హైడ్రా ఆ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ బాక్స్ డ్రైన్‌లు పూడికతో నిండిపోవడం కారణంగా ఆ పరిస్థితి తలెత్తిందని నిర్ధారించింది. వీటిలోని వరద వెళ్తేలోన ఉన్న 4 బోర్ల ద్వారా నీరు ఇంకేది. కానీ ఆ మార్గాల్లో చెత్త అడ్డురావడంతో రోడ్లు మునిగే పరిస్తితి తలెత్తింది. అందువల్ల మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు పూడిక తీత చేపట్టడం వల్ల ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉంటుంది.

**ఇవన్నీ పునరుద్ధరిస్తే ఎంతో మేలు**

హెచ్ఎంఆర్ఎల్ 2018లో మెట్రో రైల్ కారిడార్ వెంట ఇంజక్షన్ బోర్లతో కూడిన వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు 100 చేపట్టింది. వీటితో పాటు భూగర్భజలాలను పెంపొందించేందుకు 200కుపైగా భారీ ఇంకుడు గుంతలనూ తవ్వించింది. ఒక్కో ట్యాంకు, ఇంజక్షన్ బోరుకు అప్పట్లో రూ.50 వేలును ఖర్చు చేసింది. ఖైరతాబాద్, ఎర్రమంజిల్, కూకట్‌పల్లి, మియాపూర్, జేఎన్‌టీయూ, రాయదుర్గం రూట్‌లలో వీటిని తవ్వించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సైతం 50కిపైగా ఇంజక్షన్ బోర్లను వేయించింది. ఏర్పాటు చేయడమైతే చేశారు కానీ వీటి నిర్వాహణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. చాలాచోట్ల అవి కనుమరుగయ్యాయి. వీటిని పునరుద్ధరించినట్లయితే భూగర్భ జలాలు పెరిగి ముంపు తప్పే అవకాశముంది. ఈ ఎల్?నినో సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నగరంలో ఉన్న పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు సంస్థలు, కాలనీ సంఘాలు వేల సంఖ్యలో తవ్వించాయి. వాటన్నింటిలో పూడిక తీయించినట్లయితే నీరు భూమిలోకి ఇంకుతుంది. తద్వారా భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది.

**తక్షణ కర్తవ్యం :**

పాత ఇంజక్షన్ బోరు ఉన్న ట్యాంకుల పైకప్పు మీదుగా నీరు వెళ్లే విధంగా శుభ్రం చేయాలి
పైపుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతే తొలగించాలి
కాలనీలు, అపార్ట్‌మెంట్లు, పార్కుల్లో తీసిన ఇంకుడు గుంతలు పునరుద్ధరించడం
వాటిలోకి వరదనీరు వచ్చే మార్గాలు శుభ్రం చేయించాలి
నగరంలో రోడ్ల కింద తవ్విన బాక్స్? డ్రైన్లలోనూ పూడిక తీయించాలి
ఇళ్ల ముందు వాననీరు ఇంకే విధంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి
వాననీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలి
మరిన్ని ఇంకుడు గుంతలు తవ్వే విధంగా అవగాహన కల్పించాలి

పైన వివరించిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చాలా వరకు ఎల్?నినో ముప్పు నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇప్పుడు ఉన్న వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కాలంటే ఇదొక్కటే మార్గం. ప్రభుత్వం ఎన్నిచర్యలు చేపట్టినప్పటికీ పౌరసమాజం నుంచి కూడా సహకారం అవసరం. అందువల్ల జల సంరక్షణ అనేది ఒక ఉద్యమంలా సాగాల్సినటువంటి అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

-మొదటిపేజీ తరువాయి

ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు. "నేనేం తప్పు చేయలేదు.. ఏదో ఒకరోజు బెయిల్‌పై కచ్చితంగా బయటకు వస్తాను, అంతవరకు పార్టీని వేరే పార్టీకి త్యాగం చేయవద్దని వారితో చెప్పాను. పార్టీ మనుగడ కోసం జైల్లో నా ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాను" అని కవిత వివరించారు.



ఇవాళ జైలు నుంచి బయటకు వచ్చాక కొందరు బీఆర్ఎస్ నేతలు టీవీల్లో కూర్చుని ఏది పడితే అది మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి తానే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆమె పూర్తిగా ఖండించారు. ఎన్నికల సమయంలో చర్చ అంతా కేవలం ప్రభుత్వ వైఫల్యాల గురించే జరిగిందని, కానీ ఆ చేదు నిజాన్ని అంగీకరించడానికి బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికీ సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో తాను తీవ్రమైన పక్షపాతాన్ని, అవమానాన్ని చవిచూశానని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏడేళ్ల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ అందుబాటులోకి 'జహీరాబాద్ త్రివేణి వనం'

కాంక్రీటు అడవులుగా మారుతున్న పట్టణాల్లో పచ్చదనం క్రమంగా కనుమరుగవుతోంది. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కరవవుతున్న తరుణంలో దినదినాభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ వాసులకు సరికొత్త ఆహ్లాదం అందుబాటులోకి రానుంది. పట్టణ ప్రజలు ఏడేళ్లుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న 'త్రివేణి వనం ఫారెస్ట్ ఈకో పార్కు' ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నేడు(గురువారం) సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం వర్చువల్‌గా త్రివేణి వనం పార్కును ప్రారంభించనున్నారు. జహీరాబాద్ పట్టణ శివారులో, హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారి పక్కన, మహీంద్రా కర్మాగారానికి సమీపంలో 200 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ 'అర్బన్ ఫారెస్ట్ పార్కు'ను నిర్మించారు. ఏడేళ్ల క్రితం సుమారు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో ఈ పార్క్? నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అటవీ ప్రాంతాన్ని కాపాడుతూనే, పట్టణ ప్రజలకు ప్రశాంతతను పంచేందుకు చేపట్టిన ఈ పార్కు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఈ వారంలోనే సందర్శకులకు స్వాగతం పలికేందుకు 'త్రివేణి వనం' సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. హరిత నిధి పథకంలో రూ. 55 లక్షలతో పార్కును సకల సౌకర్యాలతో తీర్చిదిద్దారు.




**వనం పార్కులో ఏమేమి ఉన్నాయంటే**

పిల్లల నుంచి పెద్దల వరకు అందర్నీ ఆకట్టుకునేలా ప్రధాన ముఖద్వారం, అటవీ మధ్యలో గజెబో, వాచ్ టవర్ల నిర్మాణం పూర్తి చేశారు. సందర్శకులు సేద తీరేందుకు నాలుగు రచ్చబండలు, అటవీ జంతువుల దాహం తీర్చడంతో పాటు ప్రజల అవసరాల కోసం సోలార్‌తో నడిచే బోరు బావులను తవ్వించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడిచేందుకు 5 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్ (కాలినడక మార్గం) సిద్ధం చేశారు. యోగా ఏకకాలంలో 50 నుంచి 80 మంది ప్రశాంతంగా ధ్యానం చేసుకునేలా రెండు విశాలమైన యోగా షెడ్లు, చిన్నారులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా 'చిల్డ్రన్స్ ప్లే ఏరియా', వీటితో పాటు వాష్?రూమ్స్?, సెక్యూరిటీ గది నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

# రికార్డు స్థాయి వరి దిగుబడి తెలంగాణలో సన్న బియ్యానికి రెక్కలు

**హైదరాబాద్ :** దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినప్పటికీ.. మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు మాత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. గత 10 రోజుల్లోనే కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు ధరలు పెరిగాయి. ముఖ్యంగా డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యాన్ని తక్కువ పరిమాణంలో మార్కెట్లోకి వదులుతూ వ్యాపారులు సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు.దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది.ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధ రకాల సన్న బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా.. అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది.సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది. ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## 3 రోజులపాటు రిజిస్ట్రేషన్ సేవలు బంద్

-మొదటిపేజీ తరువాయి

అనంతరం సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడతాయని చెప్పారు.

**వరుస సెలవులు ఉన్నందునే**

నిర్దిష్ట తేదీలనే ఎంచుకోవడానికి గల కారణాలను ఐజీ వివరించారు. ఈ నెల 26న మొహర్రమ్, జూన్ 28న ఆదివారం కారణంగా ఈ రెండు రోజులు ప్రభుత్వ సెలవు ఉందని చెప్పారు. మధ్యలో ఉన్న శనివారం (జూన్ 27) ఒక్కరోజులో మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా సర్వర్ నిర్వహణ షెడ్యూల్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని, జూన్ 29వ తేదీ నుంచి అన్ని సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు.

## ఎవరు అడ్డుపడినా ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం

-మొదటిపేజీ తరువాయి

నివసించలేమని, వర్షం వస్తే ముంబయి, బెంగళూరులో బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్ నగరానికి రాకూడదనే తమ ప్రయత్నమని తెలిపారు.

**అభివృద్ధి చెస్తామంటే అడ్డుకుంటున్నారు**

మూసీ అభివృద్ధి చేస్తామంటే విపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో మూసీ చుట్టుపక్కల ఉంటే దోమలు నోట్లోకెళ్లేవన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలనే తాము ప్రయత్నిస్తున్నామని, నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారని రేవంత్ రెడ్డి మండపడ్డారు. అలా చెప్పిన ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవడన్నారు. వాళ్ల ఫ్యూచర్?ను ప్రజలు నిర్ణయిస్తే ఫాంహౌస్?కు పరిమితమయ్యారన్నారు. కల్వకుంట వాళ్ల కడుపు నిండా కాలకూట విషమేనని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. మూసీలో కాలుష్యం కంటే కల్వకుంట వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రజలు వాళ్లకు బుద్ధిచెప్పారన్నారు. ప్రజలు మురికిలోనే పొర్లాలని వాళ్లు భావిస్తున్నారన్నారు.

**ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం**

ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సబర్మతి, యమునా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్? తాగినా ఫ్యూచర్? సిటీని నిర్మిస్తామన్నారు.

**ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్ తాగినా భారత్ ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తాం**

ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్ తాగినా భారత్ ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామన్నారు. సబర్మతి, యుమనా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తామని తెలిపారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే.. వీపులకు సున్నం పెడతామని కబ్జాదారులకు సీఎం మరోసారి హెచ్చరించారు.

**ఢిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదనే తమ ప్రయత్నం : రేవంత్ రెడ్డి**

ఎల్బీనగర్ ప్రాంతంలో 424 ఎకరాలతో పార్కు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైడ్రాను తీసుకొస్తే... దానిని భూతంగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. న్యాయంగా నిర్మాణాలు చేసిన వారికి జోలికి హైడ్రా వెళ్లదన్నారు. నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే మాత్రం హైడ్రా ఊరుకోదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. చెరువులు కబ్జాలు చేయడం వల్లే కాలనీల్లో నీళ్లు నిల్వ ఉంటున్నాయని, ప్రజలు ఈ విషయం గ్రహించాలన్నారు. ఢిల్లీలో గాలి, నీరు మట్టిత్తం విషం... అక్కడ నివసించలేమని, వర్షం వస్తే ముంబయి, బెంగళూరులో బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదనే తమ ప్రయత్నమని సీఎం ప్రకటించారు.

## ఏడు రకాల సన్నాలకు బోనస్




-మొదటిపేజీ తరువాయి

మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్? కుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 30న మధిరలో జరిగే భారీ బహిరంగ సభలో రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఏడు రకాల సన్న రకాల వడ్లకు బోనస్? ఇవ్వాలని నిర్ణయించినట్లుగా వివరించారు. యాసంగి సీజన్?లో సుమారు 80 లక్షల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపిన ఆయన, కేంద్రం మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రుల సమావేశంలో డిమాండ్ చేసినట్లు వివరించారు.

వానాకాలంలో ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలవాలని నిర్ణయించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రామగుండంలో ఉత్పత్తయ్యే ఎరువుల్లో అత్యధికంగా రాష్ట్రానికే కేటాయించాలన్నారు. హైదరాబాద్? మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు బీజేపీ ఎంపీలు కలిసి రావాలని కోరారు. ఇకపై డిజిటల్ కేబినెట్ సమావేశాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

**ధాన్యం సేకరణపై కేంద్రంపై ఒత్తిడి తెస్తాం**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎక్కువగా ఉండొచ్చని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలతో విత్తనాలు వేయాలని రైతులను కోరుతున్నామన్నారు. ఎరువుల పంపిణీ, ధాన్యం సేకరణపై కేంద్రంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. లక్షమెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ యూరియాను కేంద్రం పంపించలేదన్నారు. తెలంగాణలో పండిన పంటలను కొనుగోలు చేయట్లేదని ఆక్షేపించారు. 17 లక్షల మెట్రిక్ టన్నులు తాము కొనుగోలు చేస్తే కేంద్రం ఇంకా కొనుగోలు చేయట్లేదన్నారు. తాము డిమాండ్ చేసినట్లు యూరియా రాకపోతే ఉద్యమం ద్వారానైనా సాధిస్తామన్నారు.

కేంద్రం ఎంఎస్‌పీ ప్రకటించి చేతులు దులుపుకొని రాష్ట్రంపై భారం వేస్తోందన్న మంత్రి తుమ్మల, ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రులను కలవాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మంత్రులు, అన్ని పార్టీల శాసనసభా పక్ష నేతలతో ఢిల్లీకి వెళ్తామని తెలిపారు. రామగుండం ఎరువులు ఇతర రాష్ట్రాలకు పంపించి రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. ఇక్కడి ఎరువుల కోసం అవసరమైతే ప్రభుత్వం తరపున ఉద్యమం చేపడతామన్నారు.

**వీబీజీ రామ్‌జీ పథకంపై నిరసన తెలిపాలని నిర్ణయం**

మంత్రి సీతక్క మాట్లాడుతూ వీబీజీ రామ్?జీ జులై 1 నుంచి అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి చేస్తుందని వివరించారు. ఆ పథకంపై నిరసన తెలపాలని నిర్ణయం తీసుకున్నట్లుగా చెప్పారు. వీబీజీరామ్?జీపై నలుగురు మంత్రులతో కేబినెట్ సబ్? కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ పథకంతో జరిగే నష్టాన్ని మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని చెప్పారు.

## న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు అందించాలి

- ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్
- జూన్ 20న ఇందిరాపార్క్ ముందు న్యాయవాదుల ధర్నా



**రామన్నపేట, జూన్ 18(సంచలనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నమోదు చేసుకున్న న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో జూన్ 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఈరోజు రామన్నపేట బార్ అసోసియేషన్ హాల్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి.మజీద్, కార్యదర్శి యాదాసు యాదయ్య కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి మాట్లాడుతూ, 2019 తర్వాత నమోదు చేసుకున్న వేలాది మంది న్యాయవాదులు ఇప్పటికీ హెల్త్ కార్డుల ప్రయోజనాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి న్యాయవాదికి, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత కల్పించే విధంగా హెల్త్ కార్డులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఆరోగ్య బీమా పరిమితిని పెంచడం, కుటుంబ సభ్యులు మరియు తల్లిదండ్రులను కూడా బీమా పరిధిలోకి తీసుకురావడం, రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఆసుపత్రులను ఎంపానెల్ చేయడం, అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌కు అదనపు నిధులు కేటాయించడం వంటి డిమాండ్ల సాధన కోసం న్యాయవాదులంతా ఐక్యంగా జూన్ 20న జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సంగిశెట్టి బాలరాజు, కునూరు శ్రీనివాస్, నోముల స్వామి, జెల్లా రమేష్, గడ్డం నరసింహ, గాలి సుదర్శన్, శంకర్, అంకం నరేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ



**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 18(సంచలనం న్యూస్):** జిల్లాలో వానాకాలం పంటల సాగుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వ్యవసాయ మరియు ఉద్యాన వన శాఖ లను, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జూమ్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ యొక్క సమీక్ష సమావేశం లో ఎరువుల నిల్వలు మరియు ఎరువులు కొనుగోలు కోసం రూపొందించిన యాప్ పై సమీక్షించి, జిల్లాలో యూరియా నిల్వలు సరిపడ ఉన్నాయని ఎలాంటి కొరతలు లేకుండా యూరియా ను ముందుగానే తెప్పించ వలసింది గా, జిల్లా వ్యవసాయ అధికారి నీ ఆదేశించారు. యూరియా యాప్ ను రైతులు అందరూ సక్రమంగా వినియోగించే విధంగా, ప్రచారంచేయాలని ఆదేశించారు, యూరియా యాప్ లో ఒక ఎకరానికి 2 యూరియా బస్తాలు అందుబాటులో ఉంచడం జరుగుతుంది అని తెలియచేశారు. తదుపరి ఫార్మర్ రిజిస్ట్రీ గురించి సమీక్ష నిర్వహించి, ఇప్పటి వరకు జిల్లాలో 67 శాతం పూర్తి అయింది అని మిగతా 23 శాతం కూడా పూర్తి చేయాల్సింది గా మండల వ్యవసాయ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతు అందరూ స్వచందగా ముందుకు వచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాల్సింది గా, రైతులని విజ్ఞప్తి చేశారు. మరియు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని యెడల, రైతులు కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందుటకు అర్హులు కారు అని తెలియచేశారు. వర్షాభావ పరిస్థితుల దృశ్య పంట మార్పిడి చేసుకోవాల్సింది గా, రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ వానకాలానికి 47,000 ఎకరాల కంది సాగు, లక్ష్యని నిర్దేశించారు. తప్పని పరిస్థితుల్లో, వరి పంట సాగుకు సన్న రకాల మాత్రమే సాగు చేయాల్సిందా గా సూచించారు. ఈ జూమ్ సమీక్ష సమావేశలో, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మరియు అదనపు కలెక్టర్ వెంక రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రమణ రెడ్డి, జిల్లా ఉద్యాన వన శాఖ మరియు పట్టు పరిశ్రమ అధికారిని హేమలత, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, మండల ఉద్యాన వన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ పంట పై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపు



**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 18(సంచలనం న్యూస్):** ఆయిల్ ఫామ్ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులకు ఈ పంట వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను వివరించి సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జూమ్ మీటింగ్ ద్వారా ఉద్యాన శాఖకు సంబంధించిన పథకాలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27 గాను నిర్దేశించిన లక్ష్యాలను గురించి సమీక్షించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణ పథకశీ ను పంటమార్పిడి లో భాగంగా ప్రోత్సహించాలని ఆదేశించారు. కోతులు మరియు అడవి పందుల బెడద ఉండదు కనుక రైతులను ఆయిల్ పామ్ సాగు దిశగా అడుగులు వేయించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటిన తర్వాత నాలుగవ ఏడాది నుండి కాపు మొదలై 30 ఏళ్ల పాటు ప్రతి సంవత్సరం ఆదాయం పొందవచ్చునని, రవాణా, మార్కెటింగ్ ప్రాసెసింగ్ సౌకర్యాలు కేటాయించిన కంపెనీ ద్వారా కల్పించడం జరుగుతుందని, ఒక ఎకరానికి సుమారు 10 నుండి 12 టన్నుల దిగుబడి వస్తుంది కనుక దీని ద్వారా సంవత్సరానికి ఒక ఎకరానికి సుమారు రూ.1,20,000/- నుండి రూ.1,50,000/- వరకు నికర ఆదాయం పొందవచ్చు కనుక రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిపుచ్చుకుని ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి కె. హేమలత, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ - భాస్కర్ రావు





**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 18(సంచలనం న్యూస్):** ఆలేరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తరగతి గదులు, విద్యార్థుల హాజరు, భోజనశాల, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మొత్తం ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల, సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మధ్యాహ్నం భోజనం పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత మరియు నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన డిజిటల్ లెర్నింగ్ శిక్షణ తరగతులు



**రామన్నపేట, జూన్ 18(సంచలనం న్యూస్):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో అన్న, అక్క మెంటర్ షిప్ కార్యక్రమానికి అనుబంధంగా నిర్వహించిన రెండు రోజుల డిజిటల్ లెర్నింగ్ శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత ఎంతో ఉందని విద్యార్థులు ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని చక్కని ఉపాధిని పొందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ రెండు రోజుల శిక్షణ ద్వారా తాము నేర్చుకున్న ఏఐ పరిజ్ఞానాన్ని ఆయా పాఠశాలలకు వెళ్లి కళాశాల విద్యార్థులు అక్కడి విద్యార్థులకు అవగాహన కలిగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్లుగా డాక్టర్ జె. చినబాబు, డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, డాక్టర్ జి. సునీత వ్యవ...

## టీచర్లకు ఆర్డినెన్స్ లేదా రాజ్యాంగ సవరణ ద్వారా టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

- తపస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి కానుగంటి హనుమంతరావు
- ఏబీఆర్ఎస్ఎం బాధ్యులు సూరం విష్ణువర్ధన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 18(సంచలనం న్యూస్):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం నాడు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ద్వారా ప్రధానమంత్రి, కేంద్ర విద్యా శాఖ మంత్రి మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి వినతి పత్రం పంపుటకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.అనంత రెడ్డి ను కలసి తపస్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి కానుగంటి హనుమంతరావు గారు మరియు ఏబీఆర్ఎస్ఎం బాధ్యులు సూరం విష్ణువర్ధన్ లు మాట్లాడుతూ ఈనాటి వినతి పత్రం యొక్క ప్రధాన అంశం 23 ఆగస్టు 2010 కి ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ ఆర్డినెన్స్ లేదా రాజ్యాంగ సవరణ ద్వారా టెట్ నుండి మినహాయింపు వచ్చే విధంగా చట్టం తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశీ రావు పూజారి రమేశ లు, రాష్ట్ర బాధ్యులు శ్రీహరి కృష్ణ యుగంధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కాలే శ్రీశైలం, జిల్లా కార్యదర్శి పట్నం కృష్ణ, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, వెంకటేశ్వర్లు బాలరాజు గౌడ్ సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్ కుమార్, రాజు, లక్ష్మీ కాంత్ రెడ్డి, కృష్ణ లు పాల్గొన్నారు.

## దళితుల పై దాడుల గురించి స్పందించని కె.యూ వీసీ ప్రొ.ప్రతాప్ రెడ్డి

- పరిపాలన భవనం ముందు వీసీ దిష్టిబొమ్మ దగ్ధం



**వరంగల్ జిల్లా ప్రతినిధి, జూన్ 18(సంచలనం న్యూస్):** కాకతీయ యూనివర్సిటీ లో దళిత ప్రొఫెసర్లు మరియు విద్యార్థులపై దాడుల గురించి వీసీ ప్రతాప్ రెడ్డి స్పందించడం లేదని నిరసిస్తూ యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు మాదిగ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో వీసీ ప్రతాప్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి దళిత ఉద్యోగ విద్యార్థులపై మతోన్మాదుల దాడులు వేసిన కూడా ఇంతవరకు స్పందించడం లేదని దళిత ప్రొఫెసర్ల పై ఆధారం లేని వార్తలను పోస్టర్లు ముద్రించి అంటించిన ఫ్లెక్సీలు కట్టిన వాటిపై స్పందించడం లేదని విద్యార్థులపై హాస్టల్లో దాడులు వేసిన ఏ మాత్రం చర్యలు తీసుకుంటలేదని మరి యూనివర్సిటీ లో వీసీ ఉన్నట్టా లేనట్టా అని వారు అన్నారు. దళితులపై దాడుల గురించి వీసీ నిర్లక్ష్యంగా వహిస్తున్నారని కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నాడని అన్నారు. వీసీ ని తన చాంబర్ లో స్వయంగా కలిసి దళిత విద్యార్థులు మొరపెట్టుకున్న కూడా, వినతిపత్రం అందచేసిన కూడా దానిపై ఎలాంటి స్పందించడం లేదని, ఇది అతని చాతగానితనానికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అలువాల కార్తీక్, బొచ్చు తిరుపతి, కలకోట్ల సుమన్, మంద భాస్కర్, బొట్ల మనోహర్, మంద నరేష్, కల్లేపల్లి ప్రశాంత్, ఎల్తురి సాయికుమార్, పెండ్యాల రాకేష్, కుమ్మరి శ్రీనాథ్, రాజు, గణిపాక ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

## మదనాపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా శ్రీనివాస్ రెడ్డి



**వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 18(సంచలనం న్యూస్):** వనపర్తి జిల్లా మదనాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా జనంపల్లి శ్రీనివాస్ రెడ్డి ని నియమిస్తూ, నియామక పత్రం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి వారికి అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జియంఆర్. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,వివిధ గ్రామాల ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 108 సిబ్బంది సమయస్ఫూర్తి ఇంటి వద్దే యువతికి సుఖ ప్రసవం



**వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 18(సంచలనం న్యూస్):** వనపర్తి జిల్లా మదనాపురం మండలం పరిధిలోని కొన్నూర్ తండాలో 108 అత్యవసర సేవల సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒక గర్భిణికి ఇంటి వద్దనే సుఖ ప్రసవం చేశారు. ఈ ఘటనలో తల్లి, మగబిడ్డ ఇద్దరూ సురక్షితంగా ఉన్నారు. పూర్తి వివరాలకు వెళితే మండలం పరిధిలో కొన్నూర్ తండాకు చెందిన కస్తూరి, భర్త హనుమంతు, వయస్సు 21 అనే గర్భిణికి గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో హఠాత్తుగా పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే మదనాపురం 108 అంబులెన్స్ సిబ్బంది అయిన ఈఎంటి రాములు, పైలట్ రవి క్షణాల్లో బాధితురాలి ఇంటికి చేరుకున్నారు.? అప్పటికే కస్తూరికి నొప్పులు తీవ్రం కావడంతో, ఆసుపత్రికి తరలించే సమయం లేకపోవడాన్ని గమనించిన సిబ్బంది ఆలస్యం చేయకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించారు. నిపుణులైన సిబ్బంది చొరవతో ఇంటి వద్దనే కాన్పు చేయగా, కస్తూరి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లి, బిడ్డలను క్షేమంగా పరీక్షించి, తదుపరి వైద్య సంరక్షణ కోసం వనపర్తి ప్రభుత్వ మాతృత్వ మరియు శిశు ఆరోగ్య కేంద్రానికి (ఎంసీహెచ్) తరలించి ఆసుపత్రిలో చేర్పించారు.

**గ్రామస్తుల అభినందనలు:**
సమయానికి స్పందించి, ప్రాణాపాయ స్థితి నుండి తల్లి, బిడ్డలను కాపాడిన 108 ఈఎంటి రాములు,పైలట్ రవి వారిని కాపాడినందుకు వారి సిబ్బందికి సభ్యులు, బంధువులు మరియు కొన్నూర్ తండా గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, వారి సేవలను అభినందించారు.

## హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 18(సంచలనం న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం రోజున హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ఉప సర్పంచ్‌ల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప సర్పంచ్‌లకు తగిన అధికారాలు, గౌరవ వేతనం, సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమైనప్పటికీ, వారికి తగిన గుర్తింపు, అధికారాలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉప సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లందరు ఈ నెల 25న ఇందిరాపార్క్‌లో జరిగే ధర్నాకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సురగంటి శ్రీధర్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసాల లింగస్వామి యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు మజ్జిగ నరేష్, చిన్నం బాలరాజు, మండల ఫోరం అధ్యక్షులు వెంకటేష్ నాయక్, సత్యం, కిషోర్, వివిధ గ్రామాల ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

Publisher & Owner by Reesaanvi Media House, H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Chief Editor: Bathula Ganesh.
H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Regd. No: TS-30-0043998, Email: sanchalanamnewsdesk@gmail.com, Cell: 9177108128